క్లుప్తంగా

బస్టాండ్ నిర్మాణానికి రూ.కోటి కేటాయించాలి

● హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



కమలాపూర్ : హుజూరాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ బస్టాండ్‌కు రూ.కోటి నిధులు కేటాయించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. కమలాపూర్ మండలంలోని కొన్ని సమస్యలను ప్రస్తావించారు. కమలాపూర్‌లో రూ.1.75 కోట్లతో బస్టాండ్ నిర్మాణం చేపట్టామని, అందుకు ఆ నిధులు సరిపోలేదని, మరో రూ.కోటి కేటాయిస్తే బస్టాండ్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. అదే విధంగా ఉప్పల్ రైల్వే గేట్‌పై రూ.45 కోట్లతో ఆర్వోబీ నిర్మాణం చేపట్టామని, రాష్ట్ర ప్రభుత్వం తరుపున చేయాల్సిన పనులన్నీ పూర్తయ్యాయన్నారు. కానీ కరీంనగర్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు నియోజకవర్గ ప్రజలు ఓట్లేసి రెండుసార్లు ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపించినప్పటికీ ఆర్వోబీ నిర్మాణం పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

కారోబార్‌ను విధులకు దూరంగా ఉంచండి

● డీపీఓ లక్ష్మీరమాకాంత్ ఆదేశం

ఐనవోలు : విధుల్లో నిర్లక్ష్యం వహించిన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో కారోబార్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతిరెడ్డిని తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకు గ్రామపంచాయతీ విధుల్లోకి తీసుకోవద్దని జిల్లా పంచాయతీ అధికారి ఎల్.లక్ష్మీరమాకాంత్ సోమవారం మండల పంచాయతీ అధికారి రఘుపతిరెడ్డిని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన మెమో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపూర్ గ్రామానికి చెందిన తమ్మరపల్లి శివాజీ, అతని భాగస్వాములకు ఒకే సంవత్సరంలో రెండు ఇంటి పన్ను వసూలు చేసినట్లు కారోబార్ తిరుపతిరెడ్డి రసీదులు జారీ చేసినట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో మండల అధికారులు విచారణ చేపట్టి జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక అందించారు. నివేదిక ఆధారంగా కారోబార్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని భావించిన డీపీఓ.. ఈ మేరకు ఈనెల 20వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. డీపీఓ ఉత్తర్వుల మేరకు మంగళవారం నుంచి తిరుపతిరెడ్డిని విధులకు తీసుకోబోమని ఎంపీఓ రఘుపతిరెడ్డి స్పష్టం చేశారు.

వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



శాయంపేట : వాకర్స్ అసోసియేషన్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పరకాల రఘు, ఉపాధ్యక్షుడిగా పరికి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా అరికిల్ల దేవయ్య, కోశాధికారిగా అరికిల్ల ప్రేమేందర్, కార్యదర్శులుగా బాసాని శ్రీహరి, సారంగపాణి, బాసాని సాంబమూర్తి, కుక్కల రమేశ్, సభ్యులుగా శ్రీనాథ్, గూడెపు హరికృష్ణ, కుమారస్వామి ఎన్నికైయ్యారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే వాకింగ్‌ను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. చాలా మంది చిన్న వయస్సులోనే బీపీ, షుగర్ బారిన పడుతున్నారని, ప్రతిరోజూ ఉదయం వాకింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. అనంతరం రఘును శాలువాతో వాకర్స్ సత్కరించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ సోషల్ మీడియా కన్వీనర్‌గా రాజు

ఆత్మకూరు : ఎన్‌హెచ్‌ఆర్‌సీ సోషల్ మీడియా హనుమకొండ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన కొమ్ము రాజు నియామకమయ్యారు. తన నియామకానికి సహకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ హనుమకొండ జిల్లా చైర్మన్ దుబాసి నవీన్, వరంగల్ జిల్లా చైర్మన్ గంగుల అశోక్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో గల పెద్దాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాలలో సోమవారం ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది కంటి అద్దాలు పంపిణీ చేశారు. గతంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అద్దాలు అవసరమైన విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. నాణ్యమైన కంటి అద్దాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం డాక్టర్ సంధ్య, కవిత, పాఠశాల ప్రిన్సిపల్ అనిత, హెల్త్ సూపర్‌వైజర్, అస్మా, ఆర్‌బీఎస్‌కే బృందం పాల్గొన్నారు.

రహదారులే ధాన్యం కల్లాలు..!



కామారం గ్రామ సమీపంలో మలుపు వద్ద ఆరబోసిన ధాన్యం



పెంచికలపేట సమీపంలో రోడ్డుపై ఆరోబోసిన ధాన్యం

- రోడ్లపైనే ఆరబోస్తున్న రైతులు
- రాత్రివేళ ప్రయాణానికి జంకుతున్న వాహనదారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే అంతర్గత బీటీ రోడ్లు ధాన్యం కల్లాలుగా మారాయి. ఆయా గ్రామాల రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. రాత్రివేళ ఆరబోసిన ధాన్యం కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోవడంతో గాయాలపాలవుతున్నారు. ఇటీవల అనేకమంది ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి పడిపోయి ఆస్పత్రుల పాలయ్యారు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి నెలకొంటుందని వాహనదారులు వాపోతున్నారు. రైతులకు ప్రత్యేక కల్లాలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపై ఆరబోస్తున్నారని, పాలకులు, అధికారులు పట్టించుకోవాలని అన్నారు. గతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. మండలంలోని అక్కంపేట, కామారం, పెంచికలపేట గ్రామాల సమీపంలో రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించి ఇతర ప్రదేశాలలో ధాన్యం ఆరబోసుకునే విధంగా చర్యలు చేపట్టాలని, స్థానికులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్

ఆత్మకూరు : 30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ అన్నారు. మండలంలోని నీరుకుళ్లలో ఆదివారం రాత్రి ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా విజయోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంద కృష్ణమాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగ, మాదిగ ఉప కులాలను సమీకరించి 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, నాయకులు సూరన్న, స్వామి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రఘు, మాజీ సర్పంచ్ బలరాంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



రమణయ్య కూతురు సుస్మితకు బాండ్‌ను అందజేస్తున్న స్నేహితులు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన గిరబోయిన రమణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1989–90లో రమణయ్యతో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులు రూ.50వేలు ఎస్‌బీఐ బ్యాంక్‌లో రమణయ్య కూతురు సుస్మిత పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సోమవారం బాండ్‌ను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, హైమావతిసంతోశ్, రాజేందర్, ప్రసాద్, నాగబూషణం, సుధాకర్, మ ల్లయ్య, రామరాజు, సత్యనారాయణ, రమేశ్, శ్రీకిషన్, వీరస్వామి, బాబు, రవి, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సమాజ చైతన్య దీపిక 'సాక్షి పత్రిక'

● మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్



వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, జర్నలిస్టులు

పరకాల : ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తూ సమాజాన్ని అన్ని రంగాల్లో చైతన్య పరిచేందుకు సాక్షి దినపత్రిక కృషి చేస్తోందని పరకాల మున్సిపల్ కమిషనర్ సి.హెచ్ వెంకటేశ్ అన్నారు. సోమవారం పరకాల ప్రెస్‌క్లబ్‌లో సాక్షి దినపత్రిక 18వ వార్షికోత్సవాన్ని జర్నలిస్టులతో కలిసి ఆయన పాల్గొని కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో పాఠకులను సాక్షి మరింత ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్టు రేపాల నర్సింహారాములు, ప్రెస్ క్లబ్ మాజీ కన్వీనర్ దాసరి రమేశ్, సీనియర్ జర్నలిస్టులు భలేరావు బాబ్జీ, నేరేళ్ల పరశురామ్, రావుల రాజు, మోరె రమేశ్‌బాబు, కత్తి రాజు, బొజ్జం చొక్కారావు, నయిం పాషా, కోడెపాక భాస్కర్, బాలరాజు, కోగిల చంద్రమౌళి, నర్సింగరావు, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు



దామెర : ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. బెట్టింగ్, జూదం వ్యసనమని, చట్టానికి విరుద్ధమని అన్నారు. యువత, క్రికెట్ అభిమానులు బెట్టింగ్‌లకు అలవాటుపడి వారి బంగారు భవిశ్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. బెట్టింగ్‌ల కారణంగా ఎంతో మంది ఆర్థికంగా నష్టపోయి, ఆత్మహత్యలకు దారితీస్తుందని వెల్లడించారు. ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే డయల్ 100కు గాని 112కు గాని సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి రోడ్డు సమస్యపై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అదే గ్రామానికి చెందిన యువకుడు కె.సురేశ్ ఫిర్యాదు చేశాడు. కొండపర్తి–భట్టుపల్లి, కొండపర్తి–మామునూరు, కొండపర్తి–ఐనవోలు గ్రామాలకు అనుసంధానమయ్యే బీటీ రోడ్ల నిర్మాణ పనులు రెండున్నర సంవత్సరాల నుంచి కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. కంకర పోసి వదిలేయడంతో డస్ట్ పొల్యూషన్, వాహనాలు మరమ్మతుకు చేరుకోవడం, రోడ్డు సరిగా లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించాలని కోరాడు.

'ఉత్తమ సేవలకు' దక్కిన గౌరవం



శాయంపేట : చలపతికి ప్రశంసపత్రం అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



పరకాల : అవార్డు అందుకుంటున్న కృష్ణ



దామెర : ప్రశంపత్రం అందుకుంటున్న రజిని



శాయంపేట : ప్రశంసపత్రం అందుకుంటున్న రాధిక

శాయంపేట : టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ నోడల్ పర్సన్ చలపతికి ఉత్తమ టీబీ నోడల్ పర్సన్‌గా ప్రశంసపత్రం లభించింది. వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో హనుమకొండ జిల్లా వైద్యాధికారి అప్పయ్య, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు సమక్షంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా చలపతి ప్రశంసపత్రం అందుకుకున్నారు.

టీబీ ముక్త్ గ్రామపంచాయతీగా నేరుడుపల్లి

మండలంలోని నేరేడుపల్లి గ్రామం టీబీ ముక్త్ గ్రామపంచాయతీగా ఎన్నికైంది. వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా గ్రామపంచాయతీ కార్యదర్శి రాయపురపు రాధిక, ఆశ కార్యకర్త సరితకు ప్రశంసపత్రం అందించారు.

రేడియగ్రాఫర్‌కు ఉత్తమ సర్వీస్ అవార్డు

పరకాల : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా పరకాల ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న రేడియగ్రాఫర్ రసమల్ల కృష్ణకు ఉత్తమ సర్వీస్ అవార్డు లభించింది. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

కోగిల్వాయి ఆశ వర్కర్‌కు జిల్లాస్థాయి అవార్డు

దామెర : మండలంలోని కోగిల్వాయికి చెందిన ఆశ కార్యకర్త కె.రజిని జిల్లాస్థాయి ఉత్తమ ఆశ వర్కర్‌గా అవార్డు అందుకున్నారు. సోమవారం వరంగల్‌లోని కేఎంసీలో టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, జిల్లా క్షయ నియంత్రణ అధికారి హిమబిందు చేతులమీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. పలువురు అభినందించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మంజుల, ఎంపీహెచ్‌ఈఓ అశోక్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీకాంత్ అభినందించారు.

హక్కుల సాధనతోనే మహిళా సాధికారత

● సర్వోదయ యూత్ కార్యదర్శి దామోదర్



మాట్లాడుతున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్

కమలాపూర్ : హక్కుల సాధనతోనే మహిళా సాధికారత సాధ్యమని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండలంలోని వంగపల్లిలో మహిళా సహాయక కమిటీలకు సర్వోదయ యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక చట్టాలు, వ్యవస్థలు ఉన్నాయన్నారు. గృహ హింస చట్టం, లింగ నిర్ధారణ చట్టం, నిర్భయ తదితర చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం సఖి కేంద్రం నిర్వాహకురాలు హైమావతి మాట్లాడుతూ.. గృహ హింస, లింగ వివక్షకు గురవుతున్న మహిళల కోసం సఖి వన్‌స్టాప్ సెంటర్ 24 గంటలు పనిచేస్తోందన్నారు. బాధిత మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వారి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సఖి కేంద్రం ద్వారా మహిళలకు ఉచిత న్యాయ సహాయం, తాత్కాలిక వసతి, అత్యవసర వైద్యం, కౌన్సిలింగ్, పోలీస్ రక్షణ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం నారాయణ, సీసీ మమత, గ్రామైఖ్య సంఘాల సభ్యులు రజిత, రాజకుమారి, సర్వోదయ సంస్థ ప్రతినిధులు రవీందర్, శ్రీలత, మహిళా సహాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు కాంగ్రెస్ అండగా నిలవాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్
- అమరధామం ఎదుట ఆందోళన



అమరధామం ఎదుట ఆందోళన చేపట్టిన ఉద్యమకారులు

పరకాల : అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆ ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ ఉద్యమకారుల చైతన్యయాత్ర స్థానిక అంబేడ్కర్ సెంటర్ మీదుగా పరకాల అమరధామం చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యమకారులు నిరసన తెలుపగా.. డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు రూ.25వేల పెన్షన్ మంజూరు చేయడంతో పాటు 250 గజాల ఇళ్ల స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారులు ఇమ్మడిశెట్టి రవీందర్, దామెర మొగిళి, ఆలేటి రవీందర్, పసుల సంజీవయ్య, బొచ్చు కుమార్, గజ్జి శంకర్, గిద్దెమారి సురేశ్, పల్లెబోయిన సారయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని టచ్ చేయొద్దు

● తహసీల్దార్‌కు ఆ సంఘం నాయకుల వినతి



తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహాన్ని ఇతర ప్రాదేశానికి తరలించొద్దని అంబేడ్కర్ సంఘం నాయకులు, దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు జరుగుతున్న ఫోర్‌లైన్ పనుల్లో భాగంగా అన్ని గ్రామాల్లో సెంటర్ పాయింట్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల మాదిగానే ముల్కనూరు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఉందని, తొలగించకుండా రోడ్డు పనులు చేయాలని సూచించారు. విగ్రహాన్ని అక్కడి నుంచి తొలిగించే ప్రయత్నం చేస్తే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, అధికార ప్రతినిధి సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల చేరాలు, జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య, మాదుగుల అశోక్, ఎల్తూరి ప్రేమ్, దాట్ల రాజు, చిరంజీవి, పోచయ్య, రమేశ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కార్యదర్శి నరేశ్

దామెర : మండలంలోని ఒగ్లాపూర్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఇంజపల్లి నరేశ్ మాట్లాడుతూ.. పేరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రయాణికుల దాహం తీర్చేందుకు ఈ చలివేంద్రం దోహద పడుతుందన్నారు. చలివేంద్రంలో చల్లని నీటిని అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కాంగ్రెస్ మండల నాయకులు శంకర్, రమేశ్, గ్రామస్తులు రాజిరెడ్డి, సదయ్య, కారోబార్ శ్రీనివాస్, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మీభాయి, రజిత, గ్రామపంచాయతీ సిబ్బంది రమేశ్, సబితతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్సతో 'క్షయ' నివారణ



కమలాపూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



ఎల్కతుర్తి : వంగరలో ర్యాలీ తీస్తున్న వైద్యసిబ్బంది



శాయంపేట : ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు, వైద్యసిబ్బంది

కమలాపూర్ : క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయవ్యాధిని నివారించవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఆరోగ్య ఉప కేంద్రాల్లో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక దగ్గు, ఛాతిలో నొప్పి, బలహీనత, అలసట, బరువు తగ్గడం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు రెండు వారాల కంటే ఎక్కువ కనిపిస్తే అది క్షయ వ్యాధిగా భావించి పరీక్షల ద్వారా నిర్ధారణ చేసుకోవాలని అన్నారు. నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధిని నివారించవచ్చన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినా, తుమ్మినా, ఉమ్మివేసినా గాలి ద్వారా (బ్యాక్టీరియా) ఇతరులకు సోతుకుందన్నారు. ఈ కార్యక్రమాల్లో వైద్యులు రోహిత్, అరుణ్, టీబీ మోడల్ పర్సన్ ప్రభాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


శాయంపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించినట్లు మండల వైద్యాధికారి సాయి కృష్ణ తెలిపారు. పాఠశాలల్లో, గ్రామాల్లో ప్రజలతో టీబీ వ్యాధి నివారణపై ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, హెచ్‌ఏలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయడంతో పాటు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చని వంగర పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రహమాన్, డాక్టర్ రుబీనా అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలం వంగరలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థినులచే క్షయ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. క్షయ (టీబీ) అనేది అంటువ్యాధి అన్నారు. ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియ ట్యూబర్ క్యూలోసిస్ బ్యాక్టీరియా వలన సోకుతుందన్నారు. సరియైన చికిత్స తీసుకుంటే క్షయను నివారించవచ్చన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

● మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.విజయభాస్కర్



మాట్లాడుతున్న కె.విజయభాస్కర్

పరకాల : వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలపై దృష్టిసారించాలని పరకాల మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.విజయభాస్కర్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరకాల మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.విజయభాస్కర్ మాట్లాడారు. గ్రామాల్లో బోర్లు చెడిపోయినా, విద్యుత్ సమస్యలు నెలకొన్న తక్షణమే స్పందించి పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుకుమార్, పంచాయతీ డీఈఈ జయశంకర్, విద్యుత్ శాఖ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం గ్రామకమిటీ ఎన్నిక



శాయంపేట : ఉద్యమకారుల ఫోరం శాయంపేట గ్రామకమిటీని సోమవారం ఆ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కోకన్వీనర్ పోడిశెట్టి గణేశ్, మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రంగు మహేందర్, ఉపాధ్యక్షులుగా బాసాని సాంబమూర్తి, నాలుక రాజు, ప్రధాన కార్యదర్శిగా బాసాని నవీన్, సహాయ కార్యదర్శిగా కోల నందం, కోశాధికారిగా బత్తుల రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల గౌరవ అధ్యక్షులు బలిజే నర్సింహరాములు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రామన్న, ప్రభాకర్, రఫీ, మొగిలి, ప్రభాకర్, సదానందం, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.